జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 11-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 271 పేజీలు: 4 వెల : రూ.7

# సిఐ నాగరాజ్ సార్..
# ఇటు చూడండి!









- ✳ ట్రాఫిక్ నిబంధనలు పాటించని కొందరు పోలీసులు
- ✳ రోడ్డుపైనే ఇష్టారాజ్యంగా వాహనాలు
- ✳ పనిచేయని సిగ్నల్ పాయింట్స్
- ✳ కేవలం ఫైన్లకే పరిమితమవుతున్న కొందరు సిబ్బంది
- ✳ పొట్టి శ్రీరాములు మార్కెట్ వైపు కన్నెత్తి చూడని వైనం

**శ్రీకాకుళం క్రైం, మార్చి 10 (వార్త):** శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన కొందరు ట్రాఫిక్ పోలీసులు కేవలం ఫోన్లు పట్టుకుని ఫైన్లకే పరిమితమవుతున్నారు. వాహనం వస్తే ఆపడం, జరిమాన విధించడం మినహా ట్రాఫిక్‌పై దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ట్రాఫిక్ సీఐగా నాగరాజు బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రాఫిక్ పోలీసులపై కంట్రోల్ తప్పిందా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన మాటను కొందరు ఖాతరు చేయడం లేదన్న తోటి సిబ్బందే చెబుతున్నారు. ఆయన కూడా ఉదయం, సాయంత్రం నగరంలో పోలీస్ జీపుపై ఒక రౌండ్ వేసి ఆ తర్వాత స్టేషన్‌కే పరిమితమవుతున్నారని, దీనివల్ల ఆ శాఖలో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్, ఏడు రోడ్ల జంక్షన్, పాతబస్టాండ్, అరసవల్లి జంక్షన్, రామలక్ష్మణ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఉన్నాయి. వాటిలో డేఅండ్ నైట్, ఏడు రోడ్ల జంక్షన్ల వద్ద మాత్రమే ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల పనిచేస్తున్నాయో లేదో తెలియదు గాని, అక్కడైతే వాహనాలు క్రమపద్ధతిన వెళ్లడం లేదు. దీనివల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొట్టి శ్రీరాములు మార్కెట్ ఆవరణలో తోపుడు బళ్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌లోకి వెళ్లాలంటే నానావస్థలు పడాల్సిందే. మార్కెట్ లోపల కన్నా బయటే వ్యాపారం ఎక్కువగా సాగుతోంది. ఇక్కడ తోపుడు బళ్ల వల్ల తమ వ్యాపారాలు పోతున్నాయని, వ్యాపారులు గగ్గోలు పెడుతున్నా, ట్రాఫిక్ సీఐకి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. పత్రికల్లో కథనాలు వస్తే సీఐ నాగరాజు సిబ్బందితో వెళ్లి.. ఆ ఒక్కరోజు మాత్రమే హడావిడి చేస్తుంటారు. ఆ తర్వాత మళ్లీ అవే కష్టాలు. కంఠశోష మిగిలిందే తప్ప మా సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారని వ్యాపారులు వాపోతున్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు మైక్‌లు పెట్టి హోరెత్తిస్తున్నారు. వీరి దెబ్బకు అటుగా వెళ్లే వారి చెవులకు చిల్లులు పడుతున్నాయి. జిల్లా పోలీసు కార్యాలయం పక్క ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న పండ్ల షాపులు, అంబేడ్కర్ జంక్షన్, పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో మైక్‌లు దద్దరిల్లుతున్నా.. ట్రాఫిక్ సీఐకి వినిపించడం లేదేమో అన్న అనుమానం సర్వత్రా కలుగుతోంది. ఇక ప్రైవేట్ ట్రావెలర్స్ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా వాహనాలు నిలిపివేస్తూ ప్రయాణికులను తరలిస్తున్నారు. అసలే రోడ్లు చిన్నవి కావడంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతోంది. ఇక్కడ బస్సులు నిలుపుదల చేయకుండా చర్యలు చేపట్టాలని కొందరు ట్రాఫిక్ సిబ్బందే అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎందుకు పట్టించుకోవడం లేదోనని ఆ పెరుమాళ్‌కే ఎరుక.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పనిభారం తగ్గించండి

**సంతబొమ్మాళి, మార్చి 10(వార్త):** ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యదర్శులు విధులలో పని భారం ఎక్కువగా ఉన్నందున పని భారం తగ్గించమని టెక్కలి డివిజన్ డిఎల్పిఓ ఆర్.గోపిబాల, మండల ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో పిఆర్‌డి, మండల పంచాయతీ కార్య దర్శుల సంఘం అధ్యక్షుడు డి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు యు ఉమాపతి , కె.రాజు, మండలపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# కదం తొక్కిన అంగన్‌వాడీలు






**కలెక్టరేట్, మార్చి 10(వార్త):** అంగన్‌వాడీలకు వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వర రావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల చలో విజయవాడపై ప్రభుత్వ నిర్భంధానికి నిరసనగా, 42 రోజుల సమ్మె మినిట్స్ అమలు చేయాలని కోరుతూ వారంత కదం తొక్కారు. చలో విజయవాడను భగ్నం చేసి వర్కర్లను గృహనిర్భందం చేయడం తగదంటూ అగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నేరవేర్చాలని సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను పాటించి అంగన్వాడి వర్కర్లను ఆదుకోవాలంటు నినాదాలతో హోరెత్తించారు. సోమవారం కలెక్టరేట్ గేటు వద్ద అంగన్‌వాడీలు పెద్దఎత్తున బైటాయించి ధర్నా చేసి నిరసన తెలిపారు. వాంబే కోలనీ జంక్షన్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వమే రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచుతూ జిఓ ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామికంగా వ్యవహరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, పవన్ కళ్యాణ్ స్పందించడం లేదని అన్నారు. ఎన్నికలు ముందు తెలుగుదేశం నాయకులు అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని చెప్పారని, గుర్తు చేసారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నాలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ , హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.సుజాత, కె.హేమలత, కె.లక్ష్మీ, మాధవి, చంద్రమౌళి, పి.భూలక్ష్మీ, టి.రాజేశ్వరి, రమాదేవి, రాధిక, అప్పమ్మ, లలిత, ఇ.అప్పలనర్సమ్మ, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

**పలాస:** అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్భంధం ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి,అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఎన్ హైమావతి, బి సునీత, యం మంజులకుమారి, డి సునీత, హేమలత తదితరులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలపై నిర్భంధానికి నిరసనగా పలాస ఆర్ డి ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డిమాండ్లు పరిష్కారం కాకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బి నిర్మల, కె జ్యోతి, బి చామంతి, ఇందుమతి, జయలక్ష్మి,అప్పలనరసమ్మ, మాలతి, నాగేశ్వరి, భువనేశ్వరి, సరోజిని, తో పాటు పలాస మందస, సోంపేట ప్రాజెక్టల నుంచి అంగన్వాడీ టీచర్స్, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 8 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



**పలాస, మార్చి 10(వార్త):** పలాసలో గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టు రట్టు అయిందని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటప్పారావు వెల్లడించారు. సోమవారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, వారి నుంచి సుమారు 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పలాసకు దగ్గరగా ఒడిశా ఉండడ ము వల్ల అక్కడ గంజాయి కొందరు పండించి పలాస కు చెందిన కొందరు సహాకారంతో పలాస రైల్వే స్టేషన్ కు తరలించి, ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా ఎగుమతి జరుగుతుందని అన్నార. ఒడిస్సా కి చెందిన గజపతి జిల్లా కాణిపాక్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములుతో పాటు అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ని అదుపులోకి తీసుకున్నామని, గంజాయి తీసుకోవస్తుండగా పోలీసులకు ఇందిరా గాంధీ చౌక్ వద్ద పట్టుబడ్డారని తెలిపారు. యువత లక్ష్యంగా చేసుకొని గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన్గా ఒడిశా నుంచి పలాస కేంద్రంగా చేసుకొని ఈ వ్యాపార తంతు నడుపు తున్నారని ఆయన గుర్తు చేసారు. సీఐ పి సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## వల్లభనారాయణుడిని దర్శించుకున్న శివాజీ

**మందస, మార్చి 10(వార్త):** ఉద్దానం ఆరాధ్యదైవం రట్టివల్లభనారాయణస్వామిని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ దర్శించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రట్టి గ్రామంలో వెలిసిన శ్రీవల్లభనారాయణస్వామి డోలోత్సవం వైభవంగా ప్రారంభమయ్యింది. ఐదు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో భాగంగా రెండో రోజున మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ స్వామిని దర్శించకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారి తీర్థ, ప్రసాదాలు ఆయనకు అందించారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, జుత్తు అమ్మినాయుడు, బమ్మిడి కర్రయ్య, చంద్రశేఖర్, పుల్లా వాసుదేవు తదితరులు ఉన్నారు.



# ఏపీటీఎస్‌ఏ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

**శ్రీకాకుళం, మార్చి 10(వార్త):** ఆంధ్రప్రదేశ్ ట్రేజరిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక (ఏపిటిఎస్ఏ) నిబంధనల మేరకు శ్రీకాకుళం ఖజానా కార్యాలయంలో నిర్వహించగా, నూతన కార్యవర్గం ఏర్పడిందని నూతన అధ్యక్షులు డి.శ్రీరామ్ కుమార్, సెక్రటరీ యం.డేవిడ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ అవకాశం విధి నిర్వహణలో మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రెసిడెంట్ గా డి.శ్రీరామ్‌కుమార్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.భాగ్యలక్ష్మి, సెక్రటరీ యం.డేవిడ్, ట్రేజరర్ కే.వర ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లు ఐ.జ్యోతిలక్ష్మి, బి.ప్రదీప్‌కుమార్, ఎం.సాయిప్రసాద్, వై.కోటిశ్వరావు, జాయింట్ సెక్రటరీలుగా కే.నారాయణరావు, పి.చంద్రశేఖర్, పి.రమణమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బోనేలా నాగభూషణం ఎన్నికయ్యారన్నారు. అనంతరం డి.శ్రీరామ్ కుమార్, యం.డేవిడ్ ప్యానల్ కు నమ్మకంతో గెలిపించిన ట్రేజరి కుటుంబ సభ్యులందరికి ధన్యవాదములు తెలిపారు. నూతన కార్యవర్గానికి పలువురు ప్రముఖులు, వక్తలు, ఏపిటిఎస్ఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికలలో ఏపిటిఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం కిరణ్ కుమార్, రమణారెడ్డి, పాండురంగ భాస్కర్, బొత్స శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.





## వైస్ ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్సీ

**వంగర, మార్చి 10(వార్త):** వంగర వైస్ ఎంపీపీ, వైసీపీ నాయకులు తలగాం గ్రామానికి చెందిన కిమిడి ఉమామహేశ్వరరావు మాతృమూర్తి అమ్మడమ్మ ఇటీవల మరణించిన విషయం విదితమే. సోమవారం ఎంఎల్‌సీ పాలవలస విక్రాంత్ తలగాంలో వారి నివాసానికి వెళ్లి అమ్మడమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వంగర ఎంపీపీ ఉత్తరావిల్లి సురేష్ ముఖర్జీ, జడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శన్‌రావు, రుషింగి సర్పంచ్ ప్రతినిధి ఎలకల శ్రీనివాసరావు, కొప్పర ఎంపీటీసీ సభ్యులు కిమిడి తాతబాబు, మగ్గూరు సర్పంచ్ పొలిరెడ్డి రమేష్, వంగర సర్పంచ్ కడగల పారినాయుడు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



**సంతబొమ్మాళి, మార్చి 10(వార్త):** పాత మేఘవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులకు శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు బృందం పరీక్షా కిట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఒత్తిడి లేని మనసుతో పరీక్షలు రాసుకోవాలని, క్రమశిక్షణతో కూడిన ప్రవర్తన అలవాటు చేసుకోవాలని , సమాజంలో మంచివారుగా గుర్తింపు పొందాలని, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా నడుచుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద రావు , ఉపాధ్యాయులు పవన్ కుమార్, ప్రఫుల్ కుమార్, దుర్యోధన, రవి, తిరుమల రావు పాల్గొన్నారు

## పాతపట్నంలో 12న జాబ్ మేళా

**శ్రీకాకుళం, మార్చి 10(వార్త):** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఏ), సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ఎంటర్ ప్రైస్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా 2025 మార్చి 12న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నాయి. ఈ మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పిడి కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో సంక్యు ఇండియా, డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయని, సంక్యు ఇండియా కంపెనీ ప్యాకింగ్ హెల్పర్స్ (65 ఖాళీలు) ఉద్యోగాలకు 7వ తరగతి నుండి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన 18-40 సంవత్సరాల వయస్సు గల పురుషులను ఎంపిక చేస్తుందని చెప్పారు. జీతం నెలకు రూ. 12,000. డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీ ట్రైనీ కెమిస్ట్ (50 ఖాళీలు) ఉద్యోగాలకు బి.ఎస్.సి కెమిస్ట్రీ, బి.జెడ్.సి విద్యార్హత కలిగిన 18-27 సంవత్సరాల వయస్సు గల పురుషులను ఎంపిక చేస్తుంది. జీతం నెలకు రూ. 17,000. ఈ ఉద్యోగ మేళా ఈ నెల 12న ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నంలో జరుగుతుంది. అభ్యర్థులు రేషన్ కార్డ్/ఆధార్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు మరియు బయోడేటాతో హాజరు కావాలి. మరిన్ని వివరాల కోసం 7989744612 నంబర్‌కు సంప్రదించవచ్చు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పోటీతత్వంతోనే ఉన్నత శిఖరాలు

**మందస, మార్చి 10(వార్త):** విద్యార్థులలో పోటీతత్వం ఉండాలని, దీంతో వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్ అన్నారు. ఫార్మాటివ్ అసెస్మెంట్, సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల్లో ఆరో తరగతి చదువుతున్న నగిరి శ్రీవిద్య, మద్ది రిత్విక, ఏడవ తరగతి నుంచి నగిరి మహాశ్రీ, నూకల చందు, 8వ తరగతి నుంచి నగిరి పవిత్ర, జంకా నిహారిక, 9వ తరగతి నుంచి మద్ది శ్రీజ, టి.నికిత మొదటి, రెండు స్థానాలను పొందారు. వీరు హెచ్ఎం సుందర్ సాల్మన్, ఉపాధ్యాయులు, సిబ్బంది నుంచి మెమెంటోలు అందుకున్నారు. ఈ సందర్భంగా సుందర్ సాల్మన్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడంలో ముందుంటామన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా ఇటువంటి బహుమతులు అందుకోవడానికి పోటీ పడాలని, విజేతలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మాజీ ఎంపీపీని పరామర్శించిన తిలక్



**సంతబొమ్మాళి, మార్చి 10(వార్త):** నౌపడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కర్రీ కృష్ణవేణి కుమారుడు నాగిరెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని వైఎస్ఆర్సిపి నియోజకవర్గం సమన్వయకర్త పేరాడ తిలక్ సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎం శ్రీరామ్మూర్తి, స్థానిక సర్పంచ్ పి రవి కుమార్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ బి సుధాకర్, తదితరులు ఉన్నారు.



## బెస్త కామేశ్వరరావుకు సన్మానం

**మందస, మార్చి 10(వార్త):** మందస మండలంలోని జుల్లుండ గ్రామానికి చెందిన బెస్త కామేశ్వరరావు డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన బెస్త కామేశ్వరరావుకు శ్రీషిరిడి సాయిబాబా దేవాలయ ధర్మకర్త గిన్ని తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. సంఘసంస్కర్తగా, రైతు సంఘం నాయకునిగా, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సలహా మండలి సభ్యునిగా బెస్త కామేశ్వరరావు చేసిన సేవలకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ(తమిళనాడు) గౌరవ డాక్టరేట్ ను ఇచ్చిన శుభ సందర్భంగా మందసా షిరిడి సాయి ధ్యాన మందిరం వద్ద శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయ ధర్మకర్త గిన్ని తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో షిరిడి సాయి సేవా సంఘం సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, పెద్దలు అందరూ కలిపి డాక్టరేట్ పొందిన బెస్త కామేశ్వరరావు గౌరవంగా సత్కరించారు. కార్యక్రమంలో గిన్ని తిరుపతిరెడ్డి, ప్రభాకర్ పట్నాయక్, జగన్నాథ బెహరా, కె.సీతారాం, బోర హనుమంతరెడ్డి, వాయలపల్లి నారాయణరావు, బంగారు బాబురావు, పొందర బృందావన్, కొమ్మాజోశ్యుల సీతారామశర్మ, మహిళా సభ్యులు, కామేశ్వరరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సత్యసాయి సేవా సమితి నూతన కన్వీనర్‌గా తిరుమలరావు



**పలాస, మార్చి 10(వార్త):** శ్రీ సత్యసాయి సేవాసమితి పలాస నూతన కన్వీనర్ గా ఇప్పిలి తిరుమల ఎంపికయ్యారు. సోమవారం ఎంపిక నిర్వహించారు. నూతన కన్వీనర్‌గా ఇప్పిలి తిరుమలరావు ఎంపికపై రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, పలాస జోనల్ కో ఆర్డినేటర్ బైరాగి మాస్టర్, జిల్లా పదాధికారులు హర్షము వ్యక్తం చేశారు.

## టిడ్కో లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు




**పలాస, మార్చి 10(వార్త):** టిడ్కో ఇండ్ల లబ్ధిదారులు ఉన్న సమస్యలు పై ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ప్రభుత్వం నుండి తగిన మార్గ దర్శకాలు వచ్చిన వెంటనే టిడ్కో ఇండ్ల దరఖాస్తులు పరిష్క రించడం జరుగుతుందని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్పష్టం చేశారు. ఈ సోమవారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ )కార్యక్రమం లో త్రాగునీటి కులాయి కనెక్షన్ కొరకు, టిడ్కో ఇండ్లకు సంబందించి పలు దరఖాస్తులు వచ్చినవని తెలిపారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు, వితంతు పెన్షన్లు వంటి పలు సమస్యలపై మొత్తం 13 దరఖాస్తులు రాగా అందులో బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు కొరకు 9, టిడ్కో ఇండ్ల కొరకు 1, పెన్షన్ లు కొరకు 2, త్రాగునీటి కులాయ్ కొరకు 1 దరఖాస్తు అందినవని వెల్లడించారు.

## గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే :

**వంగర, మార్చి 10(వార్త):** నవ సమాజ నిర్మాణానికి సావిత్రిబాయి పూలే ఎంత గానో కృషి చేశారని దళిత, బహుజన జేఏసీ నేతలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జేఏసీ నేతలు వంగరలో సోమవారం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత, బహుజన జేఏసీ ఉత్తరాంధ్ర అధ్యక్షులు, డివిఎంసి సభ్యుడు మజ్జి గణపతి మాట్లా డుతూ నిమ్న వర్గాల అభ్యున్నతికి కులమత బేధాలు లేకుండా ఎంతగానో కృషి చేశారన్నారు. 1873లో “సత్యశోధక సమాజ్”ను స్థాపించి బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతి సహగమనానికి వ్యతిరేకంగా, పునర్వివాహాల కొరకు, అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని సావిత్రిబాయి పూలే నడిపారని వివరించారు. కార్యక్రమంలో దళిత సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గణపతిరావు, దళిత, బహుజన నాయకులు చిత్రి గంగులు, మజ్జి ఉదయ రామ్, సిర్లి రాజు, తిర్లింగి సింహాచలం, పెంటయ్య, సింహాచలం, మురళి, జార్జి, అప్పలరాము, సింహాచలం, సాయి, చిన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీగా గ్రీష్మ నామినేషన్ దాఖలు



**వంగర, మార్చి 10(వార్త):** ఎం ఎల్ సీ అభ్యర్థి కావలి గ్రీష్మ నామినేషన్‌దాఖలు చేశారు. సోమవారంతో ఎం ఎల్ సీల నామినేషన్ గడువు ముగియడంతో రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి ఆమె నామినేషన్ పత్రాలను అందజేశారు. టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. రెండు స్థానాలు బీసీలకు ఒక సీటు ఎస్సీ యువత ఎం ఎల్ ఏ ఎం ఎల్ సీ సీటును కేటాయిస్తూ ప్రాంతీయ సమీకరణాలను పరిగణలోకి తీసుకున్నారు. ఎస్సీ మహిళా అభ్యర్థిగా కావలి గ్రీష్మకు అవకాశం దక్కింది. నామినేటెడ్ పదవిలో ఉన్నా.. గ్రీష్మను ఎమ్మెల్సీగా ఎంపిక చేయటం వెనుక అనేక అంశాలు తెర మీదకు వస్తున్నాయి. పార్టీ మహానాడు వేదికగా నాడు గ్రీష్మ తొడ గొట్టి వైసీపీకి సవాల్ చేసారు. పార్టీలో క్రియాశీలకంగా మారటంతో ఇప్పుడు ఏరి కోరి గ్రీష్మ ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. టీడీపీ నుంచి ముగ్గురు ఎమ్మెల్సీల్లో గ్రీష్మ ఎంపిక ఆసక్తి కరంగా మారింది. బీటీ నాయుడు, బీదా రవిచంద్ర ఇద్దరూ ఎమ్మెల్సీలుగా చేసారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన గ్రీష్మ తల్లి ప్రతిభా భారతి ఉమ్మడి ఏపీలో అసెంబ్లీ స్పీకర్ గా వ్యవహరించారు. 2014 లో టీడీపీ గెలిచిన తరువాత పార్టీలో గ్రీష్మ క్రియాశీలకంగా వ్యవహరించారు. 2019 లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్ష పార్టీ సభ్యురాలిగా నాటి ప్రభుత్వం పైన పదునైన వ్యాఖ్యలతో విరుచుకుపడేవారు. పార్టీ మహానాడు వేదిక నుంచి వైసీపీ నేతలను తొడ గొట్టి సవాల్ చేసారు. ఆ సమయంలో గ్రీష్మ ప్రయోగించిన భాష పైన కొన్ని అభ్యంతరాలు ఉన్నా.. ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందారు. ఫైర్ బ్రాండ్ గా పేరున్న గ్రీష్మ 2024 లో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలి విడతలోనే నామినేటెడ్ పదవి దక్కించుకున్నారు. రాష్ట్ర మహిళ ఆర్థిక సంస్థ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. గతంలో సీఎంఓలో కమ్యూనికేషన్ వ్యవహారాలు పర్యవేక్షించారు. గ్రీష్మ తాత కొత్తపల్లి పున్నయ్య గతంలో హైకోర్టు న్యాయమూర్తిగా,ఎమ్మెల్యేగా పనిచేసారు. తల్లి ప్రతిభా భారతి ఉమ్మడి ఏపీలో మంత్రిగా శాసనసభ స్పీకర్ గా వ్యవహరించారు. ఇప్పుడు గ్రీష్మకు ఎమ్మెల్సీ ఖరారు వేళ నాడు పార్టీ మహానాడు వేదికగా వైసీపీ పై తొడ గొట్టిన అంశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గ్రీష్మకు పార్టీ అరుదైన గౌరవం దక్కిందని చెప్పక తప్పదు. నామినేషన్ కార్యక్రమానికి రాష్ట్ర విద్యా, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు.

# కూటమి హయాంలో అడుగడుగునా మోసం

**- తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి**


**-మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు**




**పలాస, మార్చి 10(వార్త):** కూటమి ప్రభుత్వ హయాములో ప్రజలను అడుగడుగునా మోసం చేస్తుందని, తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వైయస్‌ఆర్‌సీపీ రాష్ట్ర డాక్టర్ సెల్ అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం పలాస ప్రగతి భవనంలో పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12న ‘యువత పోరు’తో ప్రభుత్వాన్ని నిలదీద్దామని, విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి సర్కార్ అని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసే వరకు పోరుబాట పడతామని హెచ్చరించారు. నిరుద్యోగులను నమ్మించి నట్టేట ముంచారని, నిరుద్యోగ భృతి పేరుతో మరో వంచన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి సర్కర్ వైఫల్యాలను ఎత్తి చేపేలా వైయస్‌ఆర్‌సీపీ నిరసనలు అన్ని వర్గాలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలిని పిలుపునిచ్చారు. ఈనెల 12న చేపట్టిన ‘యువత పోరు’ ద్వారా రాష్ట్రంలో యువతను, నిరుద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిలదీయాలని పిలుపునిచ్చారు. రూ.3900 కోట్ల మేరకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఉంటే ఈ బడ్జెట్‌లో కేవలం రూ.2600 కోట్లు కేటాయించడం దుర్మార్గం. అంటే విద్యార్థుల సంఖ్యను కూడా కుదించేందుకు ఈ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులను చదువులకు దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందిని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో చదువులు మధ్యలో ఆగిపోతున్నా సర్కారు చోద్యం చూస్తోందిని, పేద పిల్లలకు పెద్ద చదువులు సాకారం చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఆనాడు మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి తీసుకొచ్చారని, నిరుపేద ఇళ్ల నుంచి డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటీస్టులు తయారు కావాలన్న సమున్నత లక్ష్యంతో నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ కు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. చంద్రబాబు సర్కార్ 2014-19 మధ్యలో ఈ పథకాన్నికి తిలోదకాలు ఇచ్చిందని, ఉద్దేశపూర్వకంగా బకాయిలు పెట్టి, కాలేజీ యాజమాన్యాలను, విద్యార్థులను ఇబ్బందుల పాలు చేసిందని మండిపడ్డారు. వైయస్ఆర్ బాటలో మరో రెండడుగులు ముందుకు వేసిన వైయస్ జగన్ 93 శాతం మంది విద్యార్థులకు మేలు చేసేలా ఈ పథకాన్ని విస్తరింపచేశారని తెలిపారు. ఇప్పుడు మళ్ళీ చంద్రబాబు కూటమి సర్కార్ ఈ పథకాన్ని నీరు గార్చేందుకు ప్రయత్నిస్తోంది ధ్వజమెత్తారు. నిరుద్యోగులను అడుగడుగునా వంచిస్తోందని, కూటమి ప్రభుత్వంపై యువతలోనూ ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరవై లక్షల ఉద్యోగాలు లేదా ప్రతినెలా మూడు వేల రూపాయల చొప్పున నిరుద్యోగభృతి చెల్లిస్తానంటూ ఇచ్చిన హామీ ఏమయ్యిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటుపరంకు కుట్ర చేస్తుందని, ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేరసేందుకు వైయస్‌ఆర్‌సీపీ హయాంలో పదిహేడు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇచ్చిన మెడికల్ సీట్లను కూడా వద్దంటూ రాష్ట్రప్రభుత్వమే లేఖ రాయడం దుర్మార్గం. దుర్మార్గమని అభివర్ణించారు. 2019లో వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పైగా నిధులతో ఒకేసారి పదిహేడు ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. వీటిల్లో విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలుల 2023లో ప్రారంభమయ్యాయని అన్నారు. వీటి ద్వారా అదనంగా 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని, 2019 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో కేవలం 11 వైద్య కాలేజీలే ఉండేవి. వందేళ్ళ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని చేపట్టిన ఘనత వైయస్ జగన్ గారికే దక్కుతుందని తెలిపారు. కొత్త మెడికల్ కాలేజీలను, వాటిద్వారా వచ్చే సీట్లను కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని, వాటిని ప్రైవేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఈ తరుణంలో ప్రధాన ప్రతిపక్షంగా వైయస్‌ఆర్‌సీపీ యువతకు, విద్యార్థులకు అండగా నిలిచి ప్రభుత్వం విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అందుకోసం తలపెట్టిన యువత పోరులో కలిసి వచ్చే అన్ని విద్యార్థిసంఘాలు, యువజన సంఘాలతో వైయస్‌ఆర్‌సీపీ నేతృత్వంలో శాంతియుతంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులు, యవతతో కలిసి వైయస్సార్సీపీ శ్రేణులు ప్రదర్శన, ధర్నా కార్యక్రమం చేపట్టాలి అని ఆయన పిలుపు ఇచ్చారు.

# తప్పిపోయిన బాలుడు.. గంటల వ్యవధిలో తల్లి చెంతకు

**శ్రీకాకుళం, మార్చి 10(వార్త):** శ్రీకాకుళంలోని సత్య లాడ్జి ఎదురుగా ఓ దుకాణం వద్ద సోమవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయాన ఓ బాలుడు ఏడుస్తూ ఉండడం గుర్తించిన స్థానికులు ఫోన్ కాల్ ద్వారా రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ కి అప్పగించారు. రెండవ పట్టణ సీఐ పి.ఈశ్వరరావు జిల్లా కేంద్రంలో ఉన్న పోలీస్ కంట్రోల్ రూమ్ మరియు స్థానిక వాట్సాప్ గ్రూపు ద్వారా బాలుడి ఫోటో, గుర్తింపు వివరాలు తెలిపి, బంధువులు ఎవరైనా ఉన్నాయెడల రెండో పోలీస్ స్టేషన్ పోలీస్ వారిని సంప్రదించాలని తెలుపగా సదరు విషయాన్ని స్థానిక వాట్సప్ గ్రూపుల ద్వారా తెలుసుకున్న బాలుడు తల్లి శ్రీకాకుళం పట్టణానికి చెందిన బి.రూప హుటాహుటీన రెండో పట్టణ పోలీస్ స్టేషన్ కు చేరుకొని బాలుని చూసి సంతోషం వ్యక్తపరిచాను. ఆమె పూర్తి వివరాలు సేకరించి రెండు పట్టణ సీఐ బాలుని సాయంత్రం 5.30 గంటలకు తల్లికి అప్పగించారు. రూప రెండవ పట్టణ పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు. తక్షణమే స్పందించి వారి తల్లిదండ్రులకు అప్పగించడంలో చొరవ చూపిన రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ ఈశ్వర రావు, పోలీసు సిబ్బందిని ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

### ఆశీలు వసూలుకు 12న వేలంపాట

**ఆమదాలవలస, మార్చి10(వార్త):** ఆమదాలవలస పురపాలక సంఘానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఆశీలు వసూలుతో పాటు కమేళా పన్ను వసూలుకు 12న వేలం పాట నిర్వహించనున్నామని కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తెలిపారు. చింతాడ వారపు సంత ఆశీలు వసూలు హక్కు పొందేందుకు బుధవారం పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు ప్రకటించారు.

## రోడ్డు ప్రమాదంలో గర్భిణీ మృతి

* కబళించిన ఆర్టీసీ బస్సు
* కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబీకులు

**శ్రీకాకుళం క్రైం, మార్చి 10 (వార్త):** నగరంలోని కొత్త బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణీతో పాటు ఆమె కడుపులో ఉన్న శిశువు మృతి చెందింది. వైద్య పరీక్షలకని వచ్చి అంతలోనే కానరాని లోకాలకు వెళ్లి పోవడంతో ఆ కుటుంబీకులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. స్థానికులు, కుటుంబీకులు అందించిన వివరాలిలా ఉన్నాయి.



శ్రీకాకుళం నగరానికి సమీపంలోని కుంచాలకురమయ్య పేటకు చెందిన యంపాడ రాజేశ్వరి గర్భిణి. ఆమె భర్త దుర్గారావుతో కలిసి వైద్య పరీక్షలని మిత్తం నగరంలోని ఆసుపత్రికి సోమవారం వచ్చారు. వైద్యపరీక్షలు చేసిన డాక్టర్ ఆసుపత్రిలో జాయిన్ అవ్వాలని సూచించారు. అయితే పురిటినొప్పులు రాకపోవడంతో మంగళవారం వచ్చి జాయిన్ అవుతామని డాక్టర్‌తో చెప్పి భర్త దుర్గారావుతో బైక్‌పై తిరిగి ఇంటిముఖం పట్టారు. డై అండ్ నైట్ జంక్షన్ దాటి కొత్త బ్రిడ్జి వద్ద వెళ్లగా వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బైక్ నుంచి అదుపుతప్పి రాజేశ్వరి కిందపడిపోయింది. ఆమెపై నుంచి బస్సు వెళ్లిపోయింది. దీంతో రాజేశ్వరి, కడుపులో బిడ్డ మృతి చెందారు. టూటౌన్ పోలీసులు కేసునమోదు చేశారు. కుంచాలకురమయ్యపేటలో విషాదం చోటుచేసుకుంది.



# ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ కొలువు




* ఒక అధికార పార్టీ నాయకుడి ప్రైవేటు క్లినిక్‌లో ప్రభుత్వ వైద్యుల సేవలు * కొంతమంది ఆశా వర్కర్లకు కమిషన్ ఇస్తూ గర్భిణీలకు ప్రైవేటు క్లినిక్‌కి తరలింపు * మానవత్వం చూపని కొందరు వైద్యులు * ఇదేంటని ఎవరన్నా ప్రశ్నిస్తే న్యూసెన్స్ కేసులు * కొత్తూరులో కొందరు వైద్యుల తీరుపై సర్వత్రా విమర్శలు

**కొత్తూరు, మార్చి 10 (వార్త):** వైద్యో నారాయణ హరి అంటూ.. డాక్టర్లను దైవంగా భావిస్తారు. అలాంటిది కొందరు వైద్యులు తమ వృత్తి ధర్మాన్ని విస్మరిస్తూ.. కాసుల కోసం కక్కుర్తి పడి.. వైద్యాన్ని పక్కా వ్యాపారంగా మార్చేస్తున్నారు. కొత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కొంతమంది వైద్యులు ఇలాగే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సిన ఉన్నా.. 12 గంటల తర్వాత విధులకు డుమ్మా కొడుతున్నారు. ఏదైనా ఎమర్జెన్సీ కేసు ఉంటే ఫోన్ చేయాలని కింది స్థాయి ఉద్యోగులకు చెబుతూ.. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిపోతున్నారు. ఎవరైనా అధికారులు ఆస్పత్రికి వస్తున్నట్లు తెలిస్తే వెంటనే వచ్చి.. విధుల్లో ఉన్నట్లు నటిస్తున్నారు. అంతేనా.. ఇక్కడి వచ్చే రోగులతో మెరుగైన వైద్యం కావాలంటే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటూ రిఫర్ చేస్తున్నారు. కొత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కొందరు డాక్టర్లు బయట ఆస్పత్రుల్లో పెద్ద పెద్ద బోర్డులు పెట్టి పనిచేస్తున్నా.. ఎందుకోమరి అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం అటు ఒరిస్సాకు ఇటు ఆంధ్రకు సరిహద్దు ప్రాంతం ఈ యొక్క మండలం చుట్టుపక్కల అధికంగా గిరిజన గ్రామాలు ఎక్కువ. అయితే ఈ గిరిజన ప్రాంత వాసులకు అత్యవసర వైద్యం నిమిత్తం ఈ మండలంలోని ప్రభుత్వ దవాఖానాలే వీరికి దిక్కు. ఈ ఆసుపత్రికి రోజువారీగా కనీసం 150 నుంచి 200 వరకు ఓ.పి ఉంటుంది. దీనిని అదునుగా తీసుకొని మండలానికి చెందిన ఒక అధికార పార్టీ మండల నాయకుడి మీద ప్రేమతోనో లేక భయంతోనో లేకపోతే ప్రభుత్వ జీతాలు సరిపోకపోవడం వలనో కానీ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నటువంటి కొంతమంది ప్రధాన వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందించడం మానేసి ఆ





రాజకీయ నాయకుడి ప్రవేటు క్లినిక్ లో ఉద్యోగం చేస్తున్నారు. మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఈప్రభుత్వ దవాఖానానే పెద్ద ఆసుపత్రి. జిల్లా కేంద్రానికి చాలా దూరంగా ఉండడంతో ఈ ప్రాంతానికి ఏకైక ఆసుపత్రి కూడా ఇదొక్కటే. ఇక్కడికి వైద్యం కోసం సాధారణ రోగులే కాదు గర్భిణీలు కూడా చాలా ఎక్కువగానే వస్తుంటారు. ఇక్కడ నిధులు నిర్వహిస్తున్నటువంటి ఓ వైద్యుడు మాత్రం కొంతమంది ఆశా వర్కర్ల కు ఎంతో కొంత పారితోషకం ఇచ్చి ఈ రాజకీయ నాయకుడు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ఒక్కో గర్భిణీ దగ్గర 200 రూపాయల ఓపి ఫీజు ని తీసుకుని ఇదే క్లినిక్ లో ప్రైవేట్ మందులు అధికంగా రాసి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేంటి అని ఎవరన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను ప్రశ్నిస్తే మాత్రం వారి మీద పోలీసులకు ఫిర్యాదు చేసి వారి మీద న్యూసెన్స్ కేసులు పెట్టి భయభ్రాంతులను గురిచేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇదివరకే కొన్ని నెలల క్రితం బైకు ప్రమాదంలో ఇద్దరు వాలంటీర్లకు గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం రాగా ఇక్కడ ఎవరూ లేరు. దీనిపై వారు వైద్యురాలిని ప్రశ్నించగా వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి న్యూసెన్స్ కేసుని పెట్టించారు. దీంతో కొత్తూరుకు చెందిన వాలంటీర్లు ఈవిషయమై ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. అయినా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. కొన్ని రోజుల క్రితం సీతంపేట ఐటిడిఏ పిఓ అకస్మాత్తుగా మధ్యాహ్నం కొత్తూరు ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యుల హాజరు పట్టికను పరిశీలించగా ఎనిమిది మంది ఉండాల్సిన వైద్యుల్లో ఇద్దరే విధుల్లో ఉన్నారట. ఇకనైనా వైద్యఆరోగ్యశాఖాధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే స్పందించి కొత్తూరు ఆసుపత్రిలో ప్రజలకు వైద్యం అందేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546